


RNI NO: APTEL/2014/5832

# నవతరం

NEWS

తెలుగు దిన పత్రిక

ఎడిషన్ ఇంచార్జ్: నవచైతన్య శిరిగిరి

సంపుటి: 13, సంచిక: 260, 23-09-2026 బుధవారం వెల:1/- పేజీలు: 4

శ్రీకాకుళం - విజయనగరం - విశాఖపట్నం - రాజమండ్రి

## తీరప్రాంత గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

### ముందస్తు భద్రతా చర్యలపై సమీక్ష

*రణస్థలం, సెప్టెంబర్ 22: తీవ్ర వాయుగుండం ముప్పు, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో ముమ్మర చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మంగళవారం రణస్థలం మండలంలోని తీరప్రాంత గ్రామాలైన జీరుపాలెం, అల్లివలస, కొవ్వాడ మత్స్యలేశంలలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి స్వయంగా పర్యటించారు.*

*తీరప్రాంతాల్లో సముద్ర పరిస్థితి, గాలుల తీవ్రతను పర్యవేక్షించిన కలెక్టర్, గ్రామాల్లోని లోతట్టు, ముంపు ప్రాంతాలను పరిశీలించారు. అత్యవసర సమయంలో తీరప్రాంత ప్రజలను, మత్స్యకారులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. వర్షాలు, ఈదురుగాలుల వలన ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పునరావాస కేంద్రాలు, తాగునీరు, ఆహార సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సముద్రం తీవ్ర అలజడిగా ఉన్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకూడదని, స్థానిక ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు పాటించాలని కోరారు.*




*ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ప్రత్యేక అధికారి సుగుణాకర్, రణస్థలం తహసీల్దార్ ఎస్. కిరణ్ కుమార్, ఎంపీడీఓ ఎమ్. ఈశ్వరరావు, జేఆర్ పూరం సీఐ అవతారం, ఎస్ఐ సత్యనారాయణ, ఇతర స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.*

## ప్రజాసేవే పరమావధిగా జడ్పీని నడిపా...

***ఐదేళ్లలో రూ.65.70 కోట్లతో అభివృద్ధి పనులు***
***మొత్తం 1,922 పనులు పూర్తి***
***120 మందికి కారుణ్య నియామకాలు***
***126 మంది సిబ్బందికి పదోన్నతులు***

నవతరం, శ్రీకాకుళం: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా తన ఐదేళ్ల పదవీకాలాన్ని ప్రజాసేవకు అంకితం చేశానని పిరియా విజయ తెలిపారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన చివరి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవిని అధికారంగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావించి పనిచేశానన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.31.15 కోట్లతో 956 పనులు, సాధారణ నిధులతో రూ.34.55 కోట్లతో 966 పనులు చేపట్టినట్లు తెలిపారు. మొత్తంగా రూ.65.70 కోట్లతో 1,922 అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. విద్యుత్ ఆదా కోసం జడ్పీలో 60 కిలోవాట్ల సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కారుణ్య నియామకాల కింద 120 మందికి ఉద్యోగాలు కల్పించడంతో పాటు 126 మంది సిబ్బందికి పదోన్నతులు కల్పించినట్లు వివరించారు. సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పిరియా విజయను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ రైతులకు పంటల బీమాపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. అర్హులైన రైతులందరూ బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రక్షిత మంచినీరు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.




## బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించింది జగనే...

***కళింగ వైశ్యులకు రాజకీయ, సామాజిక గౌరవం వైఎస్సార్‌సీపీ హయాంలోనే***
***బీసీలకు 56 కార్పొరేషన్లు.. 672 డైరెక్టర్ పదవులు***
***కళింగ వైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశాం***
***టీడీపీ నేతల ప్రచారం వాస్తవాలకు విరుద్ధమన్న అందవరపు సూరిబాబు***

నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం: కళింగ వైశ్యులకు బీసీ హోదాతో పాటు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యత కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆ పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యులు అందవరపు సూరిబాబు అన్నారు. కళింగ వైశ్యుల విషయంలో ప్రస్తుత టీడీపీ నేతలు వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో కళింగ వైశ్య బీసీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే దిశగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక చర్యలు చేపట్టారని సూరిబాబు తెలిపారు. రాష్ట్రంలోని 139 బీసీ కులాలను గుర్తించి, ఏలూరులో నిర్వహించిన బీసీ గర్జనలో బీసీ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తుచేశారు. బీసీలు వెనుకబడిన వారు కాదని, రాష్ట్రానికి వెన్నెముక వంటి వారని జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారని అన్నారు.కళింగ వైశ్య కులానికి తొలిసారిగా రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని సూరిబాబు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో సుడా చైర్మన్‌గా కళింగ వైశ్య మహిళా నేత కోరాడ ఆశాలతను నియమించడంతో పాటు వై.వి.రమణ, తంగుడు జ్యోతి, భోగి లత, విశ్వేశ్వరరావులను కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమించినట్లు వివరించారు. ఈ పదవుల ద్వారా కళింగ వైశ్యులకు రాజకీయంగా అవకాశాలు కల్పించామని తెలిపారు.ప్రస్తుతం కళింగ వైశ్య రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న బోయిన గోవిందరాజులు, డైరెక్టర్లు తమకు పదవులు కల్పించిన వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేయడం సరికాదని సూరిబాబు అన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో 56 బీసీ కార్పొరేషన్లకు చైర్మన్లను, 672 మంది డైరెక్టర్లను నియమించామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీలకు, ముఖ్యంగా కళింగ వైశ్యులకు ఎన్ని రాజకీయ పదవులు కల్పించిందో వెల్లడించాలని ప్రశ్నించారు.కళింగ వైశ్యుల సంక్షేమం కోసం సీనియర్ ఐఏఎస్ అధికారి అనంతరామ్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వానికి ఓబీసీ హోదా కోసం సిఫారసులు చేయించినట్లు సూరిబాబు తెలిపారు. ఢిల్లీలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగేందుకు కూడా అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కళింగ వైశ్యుల సమస్యలను పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కళింగ వైశ్యుల సంక్షేమంపై దృష్టి సారించాలని సూరిబాబు కోరారు. కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా కళింగ వైశ్యుల్లో పేదరిక నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కళింగ వైశ్య కార్యాలయంలో రాజకీయ సమావేశాలు నిర్వహించడం కూడా సముచితం కాదని పేర్కొన్నారు.కళింగ వైశ్యులను వంద రోజుల్లో బీసీలుగా మార్చామని టీడీపీ నేతలు చేస్తున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని కళింగ వైశ్య బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీను అన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ధర్మాన కుటుంబం చేసిన కృషితోనే కళింగ వైశ్యులకు బీసీ హోదా దక్కిందని పేర్కొన్నారు. 2023లో జారీ చేసిన జీవో నంబర్ 20 ద్వారా బీసీల్లో చేర్చినట్లు తెలిపారు. దీనిపై ఆధారాలతో చర్చకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.సమావేశంలో కోరాడ చంద్రభూషణ్ గుప్తా, వైశ్యరాజు మోహన్, ఇతర బీసీ సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.




## కేంద్ర మంత్రి ను కలిసిన చౌదరి పురుషోత్తం నాయుడు

**ఆస్ట్రేలియా నుంచి వచ్చిన సందర్భంగా భేటీ..**
**పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు**
**ఆత్మీయంగా పలకరించుకున్న ఇరువురు**
**వివిధ అంశాలపై కొద్దిసేపు సంభాషణ**



*నవతరం, శ్రీకాకుళం: ఆస్ట్రేలియా నుంచి శ్రీకాకుళం విచ్చేసిన చౌదరి పురుషోత్తం నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పురుషోత్తం నాయుడు కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురూ ఆత్మీయంగా పలకరించుకుని కొద్దిసేపు వివిధ అంశాలపై సంభాషించుకున్నారు. స్నేహపూర్వక వాతావరణంలో ఈ భేటీ జరిగింది.*

## తుఫాను ముందస్తు చర్యలపై ఎమ్మెల్యే NER ఆదేశాలు

***నాలుగు మండలాల అధికారులతో సమీక్షా సమావేశం***
***ముంపు, లోతట్టు, తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా***
***రెస్క్యూ బృందాలు, జేసీబీలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలి***
***ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు పరిస్థితిపై నివేదిక ఇవ్వాలి***



నవతరం ఎచ్చెర్ల: తుఫాను ముప్పు నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలతో అప్రమత్తంగా ఉండాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (NER) ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల అధికారులతో తుఫాను ముందస్తు చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని మండలాల్లో 24×7 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముంపు, లోతట్టు, తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, బలహీన ఇళ్లలో నివసించే కుటుంబాలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, మందులు, విద్యుత్, వైద్య సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని, గర్భిణులు, చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యుత్, రహదారులు, రెస్క్యూ కార్యకలాపాల కోసం అత్యవసర బృందాలతో పాటు జేసీబీలు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. తీర ప్రాంతాల్లో మత్స్యకారుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.చెరువులు, కాలువలు, వాగులు, గట్లపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ప్రతి శాఖ చెక్‌లిస్ట్ ఆధారంగా పూర్తి స్థాయి సన్నద్ధతతో ఉండాలని సూచించారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు పరిస్థితిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. తుఫాను వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రజల ప్రాణాలు, పశు సంపద, పంటలు, ఆస్తుల రక్షణే ప్రధాన లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ పొగిరి సుగుణాకరరావు, మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఐసీడీఎస్ అధికారులు, వీబీజీ రామ్‌జీ అధికారులు, ఫైర్ ఆఫీసర్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖ అధికారులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యాధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవతరం తెలుగు దిన పత్రిక

# నిత్యావసర ధరల భారం.. ప్రజా సంక్షేమం శూన్యం

**ధరల నియంత్రణలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం**

**సామాన్య ప్రజలను అడ్డంగా దోచేస్తున్నారు**

**ఆకాశాన్నంటుతున్న ధరలతో ప్రజలు విలవిల**

**ధరలు తగ్గించే వరకు ప్రజల పక్షాన పోరాటం**

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుభిక్షం.. ఇప్పుడు దుర్భిక్షం**

**చంద్రబాబు ఫేక్ మాటలు నమ్మి ప్రజలు మోసపోయారు**

**స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి: రెడ్డి శాంతి**




**నవతరం పాతపట్నం**

నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రెడ్డి శాంతి అన్నారు. ధరలను నియంత్రించేందుకు కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆమె విమర్శించారు. బియ్యం, వంట నూనె, ఉల్లి, కూరగాయలు, చింతపండు, గ్యాస్, పెట్రోల్, డీజిల్‌తో పాటు విద్యుత్ చార్జీలు కూడా పెరిగాయని రెడ్డి శాంతి ఆరోపించారు. పెరుగుతున్న ధరలతో నెలవారీ కుటుంబ బడ్జెట్ తారుమారవుతోందని పేర్కొన్నారు. ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాలనలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ఆమె వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం అమలవుతున్న పరిస్థితులకు మధ్య తేడా ఉందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బియ్యం బస్తా రూ. 1,200 వరకు ఉంటే ప్రస్తుతం రూ. 1,800కు చేరిందని ఆమె పేర్కొన్నారు. అలాగే వంట నూనె, చింతపండు, ఉల్లి, పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ చార్జీల విషయంలోనూ ధరల పెరుగుదల కనిపిస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలు గుర్తుంచుకోవాలని, ప్రస్తుతం ఎదుర్కొంటున్న ధరల భారాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని రెడ్డి శాంతి కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపై ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆమె సూచించారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, ఉచిత ఇసుక అందిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమైందని ఆమె ఆరోపించారు. వంశధార నది తీర గ్రామాల నుంచి ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని, దీనివల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు. నిత్యావసర ధరలను తక్షణమే నియంత్రించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

# భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

## వంశధార ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర

నవతరం, సెప్టెంబర్ 22: రానున్న రోజుల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని బి.ఆర్.ఆర్. వంశధార ప్రాజెక్ట్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర కోరారు. వంశధార ప్రాజెక్ట్ పరిధిలో నిర్వహించిన వరదల సన్నద్ధత సమావేశంలో రానున్న భారీ వర్షాలు, తుపాను ప్రభావం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

సెప్టెంబర్ 22 నుంచి 25వ తేదీ వరకు తుపాను ప్రభావం, భారీ వర్షాలు ఉండే అవకాశం ఉన్నందున వంశధార ప్రాజెక్ట్ పరిధిలోని కుడి, ఎడమ ప్రధాన కాలువలను పూర్తిగా మూసివేసి, వరద ప్రభావం వల్ల కాలువలకు ఎటువంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వంశధార ఆయకట్టు పరిధిలోని అన్ని చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎక్కడైనా అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటే ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నీటి సంఘాల సభ్యులతో సమన్వయం చేసుకుంటూ, అధిక వర్షాల కారణంగా పంట పొలాలకు ముంపు రాకుండా అప్రమత్తంగా చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయి ఇంజినీరింగ్ సిబ్బందికి అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. వరద నీటి ప్రవాహ సమయంలో చెరువుల సర్ప్లస్ చానల్స్, కల్వర్టులు పూడుకుపోకుండా, నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, అందుబాటులోకి వస్తున్న నీటి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చెరువులను నీటితో నింపడం ద్వారా చుట్టుపక్కల గ్రామాలకు కూడా సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కాలువల్లో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా, వినాయక నిమజ్జనాలను కాలువల్లో చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెరువులు లేదా నదుల్లో మాత్రమే నిమజ్జనం చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

వరదలు, భారీ వర్షాల పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పర్యవేక్షక ఇంజినీర్ సూచించారు.



# ఎనిమిదేళ్లుగా.. గుర్రపు డెక్కలో లోకసముద్రం!

## 30 ఎకరాల చెరువు పూర్తిగా నిరుపయోగం

***వ్యవసాయం, పశువుల అవసరాలకు నీరు అందక గ్రామస్థుల అవస్థలు***

***పలుమార్లు వినతులు.. ప్రజాప్రతినిధుల హామీలు.. అయినా నిధులు మంజూరు కాలేదంటున్న గ్రామస్థులు***

***చెరువును పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ముందుకు సాగని పనులు***

నవతరం శ్రీకాకుళం: ఒకప్పుడు వ్యవసాయానికి, పశువుల అవసరాలకు, గ్రామస్థుల నిత్యావసరాలకు నీటిని అందించిన చెరువు.. నేడు గుర్రపు డెక్కతో పూర్తిగా నిండిపోయి నిరుపయోగంగా మారింది. సంవత్సరాలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో.. చెరువును ఎప్పుడు బాగు చేస్తారంటూ పాత్రునివలస గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. శ్రీకాకుళం మండలం పాత్రునివలస గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 194లో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో లోకసముద్రం చెరువు ఉంది. గ్రామానికి ఆనుకుని ఉండటంతో గతంలో ఈ చెరువు నీటినే స్థానికులు వ్యవసాయ అవసరాలకు, పశువులకు, ఇతర నిత్యావసరాలకు వినియోగించుకునేవారని గ్రామస్థులు తెలిపారు. అయితే గత ఎనిమిదేళ్లుగా చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయి.. మొత్తం నీటి విస్తీర్ణాన్ని ఆక్రమించిందని పేర్కొన్నారు. దీంతో చెరువు నీటిని వినియోగించుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి వనరుగా ఉండాల్సిన చెరువు.. ప్రస్తుతం గుర్రపు డెక్కతో నిండిపోయి నిరుపయోగంగా మారిందని తెలిపారు.

***పరిశీలనలు.. హామీలు.. అయినా నిధులు ఎక్కడ?***

లోకసముద్రం చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలని సంబంధిత అధికారులకు అనేకసార్లు వినతులు సమర్పించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చెరువును ప్రత్యక్షంగా పరిశీలించి.. గుర్రపు డెక్క తొలగించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువును కాపాడితేనే గ్రామానికి ప్రయోజనం సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లోకసముద్రం చెరువు గ్రామానికి కీలకమైన నీటి వనరుగా ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇంతటి విస్తీర్ణం కలిగిన చెరువు సంవత్సరాల తరబడి నిరుపయోగంగా ఉండటం వల్ల నీటి వనరును కోల్పోతున్నామని అంటున్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి చెరువులోని గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసి, పనులను త్వరితగతిన చేపట్టాలని కోరుతున్నారు. చెరువును పునరుద్ధరించి మళ్లీ గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న ఈ సమస్యకు ఇప్పటికైనా పరిష్కారం లభిస్తుందా.. లోకసముద్రం మళ్లీ గ్రామానికి నీటి వనరుగా మారుతుందా.. అన్నది వేచి చూడాల్సి ఉంది.

# మత్స్యకారులకు అండగా గౌతు శిరీష

## తుఫాన్ నేపథ్యంలో తీర గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

***పూడిలంక, మంచినీళ్లపేట, హుకుంపేటలో పరిస్థితుల పరిశీలన***

***మత్స్యకారుల సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఎమ్మెల్యే***

***సముద్ర పరిస్థితులు అనుకూలించే వరకు వేటకు వెళ్లొద్దని సూచన***

***అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశం***

నవతరం వజ్రపుకొత్తూరు: తుఫాన్ ప్రభావంతో తీర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను తెలుసుకునేందుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం వజ్రపుకొత్తూరు మండలంలోని పూడిలంక, మంచినీళ్లపేట, హుకుంపేట గ్రామాల్లో పర్యటించారు. మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.

తుఫాన్ ప్రభావంతో సముద్రంలో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో చేపల వేటకు వెళ్లలేని పరిస్థితులు, ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తీర ప్రాంత పరిస్థితులపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. మత్స్యకార కుటుంబాల సమస్యలు, వారికి అందుతున్న ప్రభుత్వ సహాయ చర్యలపై కూడా ఆరా తీశారు.

ఈ సందర్భంగా గ్రామస్థులు తుఫాన్ సమయంలో మత్స్యకారుల భద్రతతో పాటు తాగునీరు, విద్యుత్, రహదారులు, పారిశుద్ధ్యం, అత్యవసర పరిస్థితుల్లో అందాల్సిన ప్రభుత్వ సహాయం తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను నమోదు చేసుకున్న గౌతు శిరీష సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

తుఫాన్ పరిస్థితుల్లో ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సముద్ర పరిస్థితులు పూర్తిగా అనుకూలించే వరకు మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. తీర ప్రాంతాల్లో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, రహదారి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ చర్యలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. పర్యటనలో మత్స్యశాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొని తీర ప్రాంత పరిస్థితులను పరిశీలించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన సహాయ చర్యలు కొనసాగిస్తూ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే గౌతు శిరీష భరోసా ఇచ్చారు.






# ఎయిర్ ట్రావెలర్ అసోసియేషన్ శ్రీకాకుళం నూతన కార్యవర్గం

## అధ్యక్షురాలుగా డా. పైడి సింధూర

నవతరం, శ్రీకాకుళం: ఎయిర్ ట్రావెలర్ అసోసియేషన్ శ్రీకాకుళం చాప్టర్ నూతన కార్యవర్గ అధ్యక్షురాలుగా డా.పైడి.సింధూర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, పూర్వపు అధ్యక్షులు లయన్ నటుకుల.మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్ఎస్ జ్యుయలర్స్ భవనంలో నూతన కార్యవర్గం సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు అధ్యక్షులు లయన్ నటుకుల.మోహన్ నూతన కార్యవర్గాన్ని వెల్లడించి మాట్లాడుతూ కార్యదర్శిగా అడ్వకేట్ కొంక్యాన.సుభాష్, ఉప కార్యదర్శిగా మాధవి, మొదటి ఉపాధ్యక్షులుగా మనోహర్, రెండవ ఉపాధ్యక్షులుగా ఎస్ఎస్ ట్రావెల్ శ్రీను, కో-ఆర్డినేటర్ గా ఉత్తమ్, కోశాధికారిగా ఉరిటి.శ్రీను , డైరెక్టర్ గా ఎస్ఎస్ శ్రీను, బి.బాను.ప్రకాష్ లు ఎన్నికయ్యారని, నేటి నుండి వీరి సేవలు, ఎయిర్ ట్రావెలర్ అసోసియేషన్ శ్రీకాకుళం చాప్టర్ లో కొనసాగనున్నాయని తెలిపారు. అనంతరం నూతన అధ్యక్ష కార్యవర్గ బృందంను పలువురు వక్తలు అభినందించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఇందులో భాగముగా నూతన సభ్యులు, భవిష్యత్ లో చేపట్టబోయే కార్యక్రమాల సమావేశాన్ని నిర్వహించారు.

# అమ్మ కోసం...!

అమ్మ......అనంతమైన
ఆనందాలను సమకూర్చి
నీ బ్రతుకును సుఖమయంచేసే !
ఆనందమయి......
కదిలే దేవత.......

మన బతుకులను
అపురూపంగా తీర్చిదిద్దే
మహాశిల్ప........
తొణికిసలాడే కరుణ.....
అవ్యాజమైన ప్రేమ.
మనసునిండా లాలిత్యం,
సృజనాత్మకతను చూపే
పరిణతి నిండిన నిండుకుండ.

"తను" వుంటే! తనువంతా
పులకింత......
తనవెంత మనసంతా
సంపూర్ణత.
తన సందేశం.మన బ్రతుక్కి
వేదం...

తను కరిగి నిన్ను ఎదిగిస్తుంది.
తన శక్తిని నీకిచ్చి




నిన్ను నిలపెడుతుంది.
తాను లేకున్నా "
తను" కనిపించేలా జీవించు........!
కలత తన ఆత్మకు
కలిగించకు.......!!
అదే మనం అమ్మకు
అమ్మలకూ......!!!
అందించే ఘనమైన నివాళి !
అశృతర్పణం........!!

ఈ జగతిని చూపించే అమ్మ
అనురాగానికి ప్రతీక



నంజుటి యాదయ్య
9849693378
వినాయక నగర్
హయాత్ నగర్
హైదరాబాదు 2

# తుఫాను నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

## శ్రీకాకుళం జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

- జిల్లాలో టోల్ ఫ్రీ నెంబర్ 08942 240557 ఏర్పాటు
- రాత్రి సమయాలలో ప్రయాణాలు చేయకపోవడం మేలు
- రెవెన్యూ, పోలీసు, వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలి.
- పాఠశాలలకు సెలవులు, చిన్నారులు జాగ్రత్త



విజయనగరం, సెప్టెంబర్ 22: బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడటంతో భారీ తుఫాను నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి మరియు శ్రీకాకుళం జిల్లా ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలు కూడా అధికార యంత్రాంగానికి సహకరించాలన్నారు. తీరం దాటి వెళ్లే వరకు మరో రెండు రోజులపాటు బుధ, గురువారాలలో కూడా భారీ నుంచి అతి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అందిస్తున్న వివరాల ప్రకారం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని, ఎటువంటి మానవ, పశు ప్రాణ నష్టాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బుధవారం పాఠశాలలన్నిటికీ విద్యాశాఖ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సెలవులు ప్రకటించారని, ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు వారు విద్యాశాఖ అధికారుల సూచనలను పాటించాలని ఆదేశించారు. అలాగే ఇంటి వద్ద ఉన్న చిన్నారులు కాలవలు, వాగులు, ప్రాజెక్టులు వద్దకు వెళ్లకుండా పెద్దలు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులకు సూచించారు. వరద ప్రవాహాన్ని వీక్షించటానికి ఇష్టపడుతూ అనేకమంది పెద్దవాళ్ల సైతం పిల్లలను వెంటబెట్టు తీసుకువెళతారని సరదా విషయం ప్రాణాపాయం కాకూడదంటే తప్పనిసరిగా సురక్షితంగా ఉండటమే మేలని మంత్రి కొండపల్లి సూచించారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ఒక ప్రత్యేకమైన టోల్ ఫ్రీ నెంబర్ను 08942 240557 అందుబాటులో ఉంచడం జరిగిందని, అత్యవసర సమయాలలో ప్రజలు మండల కేంద్రాలలో ఏర్పాటుచేసిన అధికారులకు సమాచారం అందించాలన్నారు. అలాగే మత్స్యకారులు తుఫాను తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా వేటకు వెళ్ళవద్దని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. అలాగే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వరద నీరు వంతెనలు లేని చోట రోడ్లపై నుండి కూడా ప్రవహిస్తుందని, కనుక వాహనదారులంతా అప్రమత్తంగా ఆచితూచి వ్యవహరిస్తూ రాకపోకలు సాగించాలని, రాత్రి సమయాలలో ప్రయాణాలు వాయిదా వేసుకోవటం మేలని మంత్రి తెలిపారు. అధికారుల సూచనలతో ప్రమాదకరమైన రహదారులలో ప్రయాణాలు నిలుపుదల చేయడం జరిగిందని వాహనదారులు గమనించాలన్నారు. రెవిన్యూ, పోలీసు, విపత్తు నిర్వహణ శాఖలు వరద నివారణ, జాగ్రత్త చర్యలు తీసుకుంటారని, ముఖ్యంగా వైద్యశాఖ వరద ప్రవాహ కారణంగా ఎటువంటి అంటురోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. వాతావరణ హెచ్చరికలను, ప్రభుత్వ సూచనలను, అధికారుల మాటలను ప్రజలంతా తప్పనిసరిగా పాటించడం ద్వారా నష్టాలను నివారించవచ్చని, ప్రాణాలు కాపాడుకోవచ్చని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

# కృత్రిమ మేధతో వ్యాపారాభివృద్ధికి కొత్త అవకాశాలు

## వ్యాపార ప్రణాళికలో సాంకేతికత వినియోగంపై అవగాహన... మార్కెటింగ్, వినియోగదారుల చేరువపై ప్రత్యేక శిక్షణ

**స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపయోగకరమైన సూచనలు**

**వ్యాపార విస్తరణకు కృత్రిమ మేధను వినియోగించుకోవాలని సూచన**

**లబ్ధిదారుల వ్యాపార యూనిట్లను పరిశీలించిన ప్రతినిధులు**






**నవతరం ఆముదాలవలస**

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే చిన్నతరహా వ్యాపారాలను సైతం మరింత అభివృద్ధి చేసుకోవచ్చని నిపుణులు సూచించారు. కృత్రిమ మేధను వ్యాపార అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవడం ద్వారా వ్యాపార ప్రణాళిక, ఉత్పత్తుల ప్రచారం, వినియోగదారులను చేరుకోవడం, మార్కెట్ విస్తరణ వంటి అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

ఆముదాలవలస మండలంలో వాధ్వాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో మంగళవారం పరస్పర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారాన్ని ప్రారంభించడం నుంచి దాన్ని విస్తరించే వరకు అవసరమైన ప్రణాళిక, మార్కెట్ అవసరాలను గుర్తించడం, వినియోగదారుల అభిరుచులను తెలుసుకోవడం, ఉత్పత్తులకు ప్రచారం కల్పించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ముఖ్యంగా కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికతను వ్యాపారాల్లో ఎలా ఉపయోగించుకోవచ్చో వివరించారు. వ్యాపారానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడం, ఉత్పత్తులకు ప్రచార వ్యూహాలను రూపొందించడం, వినియోగదారులతో మెరుగైన సంబంధాలను ఏర్పరచుకోవడం, కొత్త మార్కెట్లను గుర్తించడం వంటి అంశాల్లో ఆధునిక సాంకేతికత అందించే అవకాశాలను వివరించారు. చిన్న వ్యాపారులు కూడా అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను సద్వినియోగం చేసుకుని తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

అనంతరం స్వయం ఉపాధి పథకం ద్వారా లబ్ధి పొందిన పలువురు వ్యాపారవేత్తల వ్యాపార యూనిట్లను ప్రతినిధులు పరిశీలించారు. వ్యాపార నిర్వహణ, ఉత్పత్తుల విక్రయాలు, ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్తులో వ్యాపార విస్తరణకు అవసరమైన చర్యలపై లబ్ధిదారులతో చర్చించారు.

వ్యాపారాలను స్థిరంగా నిర్వహిస్తూ ఆదాయాన్ని పెంచుకునేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో వాధ్వాని ఫౌండేషన్ సీనియర్ కార్యక్రమ నిర్వాహకులు, సలహాదారు, శ్రీకాకుళం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు చెందిన స్వయం ఉపాధి పథకం సిబ్బంది అరుణ, ధనలక్ష్మి, జిల్లా కార్యక్రమ నిర్వాహకులు మార్టిన్, సహాయ కార్యక్రమ నిర్వాహకులు హరికృష్ణ, నారాయణరావు, సమన్వయకర్తలు, సాంకేతిక నిపుణులు జయశంకర్, వాసు, శిక్షణా కేంద్ర ప్రతినిధులు, వ్యాపార అభివృద్ధి సేవల ప్రతినిధులు, స్వయం ఉపాధి పథకం లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నవతరం
తెలుగు దిన పత్రిక

# సేవా సంకల్ప అభియాన్‌తో ప్రజలకు మేలు

## శ్రీకాకుళం రిమ్స్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం

***శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గొండు శంకర్***

***అన్ని విభాగాల ప్రత్యేక వైద్య నిపుణులతో సేవలు***

***ఒకే చోట పరీక్షలు, వైద్య సేవలు***

***2,269 మందికి ఉచిత వైద్య సేవలు***

నవతరం, శ్రీకాకుళం: సేవా సంకల్ప అభియాన్‌తో ప్రజలకు మేలు చేకూరుతోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (రిమ్స్) ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా రాష్ట్రంలో తొలి మెగా వైద్య శిబిరాన్ని శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాల ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రిమ్స్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ లుకలాపు ప్రసన్న కుమార్ మాట్లాడుతూ సాధారణ వైద్య సేవలతో పాటు సూపర్ స్పెషాలిటీ సేవలను ఒకే చోట అందించడమే శిబిరం లక్ష్యమన్నారు. అవసరమైన పరీక్షలు నిర్వహించి, అదే రోజు వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అవసరమైతే రిమ్స్‌లోనే చేర్పించి ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తామన్నారు. గర్భిణులు, రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వంటి అసంక్రమిత వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలపై ప్రత్యేకంగా పరీక్షలు, వైద్య సలహాలు అందించినట్లు తెలిపారు. క్యాన్సర్ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



శిబిరానికి సుమారు 2,269 మంది హాజరై వైద్య సేవలు పొందారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, నెఫ్రాలజీ, మానసిక వైద్యం, ఆర్థోపెడిక్స్, దంత వైద్యం తదితర విభాగాల్లో వైద్య సేవలు అందించడంతో పాటు 506 మందికి ప్రయోగశాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, రిమ్స్ వైద్యులు, ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొన్నారు.



# జేఏసీ మహాసభను విజయవంతం చెయ్యండి

## – ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు

నవతరం, శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్య సంఘం ఆధ్వర్యంలో జరగనున్న జేఏసీ మహాసభను విజయవంతం చెయ్యండని, పౌర విమానాయశాఖ మంత్రివర్యులు కింజరాపు.రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపి కార్యాలయంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్య సంఘం మర్యాదపూర్వకంగా కలసి, జేఏసీ మహాసభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను చూస్తున్నామని, జేఏసీ మహాసభకు హాజరౌతానని హామీనిచ్చారు. సంఘం సభ్యుల బృందం మాట్లాడుతూ మహాసభలను విజయవంతం చెయ్యడంలో ప్రొత్సాహాన్ని అందిస్తూ, కీలక పాత్రధారి ఐన, యంగ్ అండ్ డైనమిక్ లీడర్, యూత్ ఐకాన్ శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. ఆ స్పందించిన విధానంలోగాని, మాట తీరులో గాని, ఆయన రాజసం కనిపిస్తుందని, ఆయన చిరునవ్వే సమాధానమని, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్య సంఘం సభ్యులకు ఈ రోజు సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అద్యక్షులు జంగం జోషి, గౌరవ అధ్యక్షులు మమ్ములను.తిరుపతిరావు, కార్యదర్శి గెద్ద చిరంజీవి, జోనల్ అడ్వైజర్ కోన.ప్రకాష్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాలకొండ రాజు, సుగ్గు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బీఐ ఏటీఎంలో అపరిశుభ్రతపై ఆగ్రహం

- దండి వీధి ఏటీఎం కేంద్రంలో చెత్తాచెదారం పేరుకుపోయిందని ఆరోపణ
- దుర్గంధంతో వినియోగదారుల అవస్థలు
- నెలలుగా ఏసీ పనిచేయడం లేదని వెల్లడి
- నిర్వహణ లోపంపై స్థానికుల అసంతృప్తి
- వెంటనే శుభ్రపరిచి నిర్వహణ మెరుగుపరచాలని డిమాండ్
- పసుపులేటి సురేష్ సింగ్, విజయనగరం జిల్లా ఓబీసీ మోర్చా ఇన్‌చార్జి, బీజేపీ శ్రీకాకుళం





**నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం:** శ్రీకాకుళం పాత పట్టణంలోని దండి వీధి ఎదురుగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏటీఎం కేంద్రంలో అపరిశుభ్రత నెలకొందని బీజేపీ శ్రీకాకుళం ఓబీసీ మోర్చా ఇన్‌చార్జి పసుపులేటి సురేష్ సింగ్ ఆరోపించారు. ఏటీఎం గదిలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు దుర్గంధం వెదజల్లుతున్నట్లు పేర్కొన్నారు.

ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. నగదు ఉపసంహరణ కోసం ఏటీఎం కేంద్రానికి వెళ్లినప్పుడు గదిలో ప్లాస్టిక్ కవర్లు, పాత రశీదులు, ఇతర చెత్తాచెదారం కనిపించిందని తెలిపారు. గదిలో దుర్వాసన రావడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

గత కొద్ది నెలలుగా ఏటీఎం గదిలో ఏసీ కూడా పనిచేయడం లేదని, నిర్వహణ సరిగా లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. గత కొంతకాలంగా ఏటీఎం కేంద్రంలో పరిశుభ్రతపై తగిన శ్రద్ధ చూపడం లేదని, దీనిపై స్థానిక ప్రజలు, బ్యాంకు వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ప్రతిరోజూ పలువురు ఖాతాదారులు నగదు ఉపసంహరణ కోసం వినియోగించే ఏటీఎం కేంద్రంలో కనీస పరిశుభ్రత, నిర్వహణ లేకపోవడం సరికాదని సురేష్ సింగ్ పేర్కొన్నారు. ఎస్‌బీఐ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి దండి వీధిలోని ఏటీఎం కేంద్రాన్ని శుభ్రపరిచి, ఏసీతో పాటు ఇతర నిర్వహణ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇకపై నిరంతరం పరిశుభ్రత, నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం పట్టణ ప్రజల తరఫున విజ్ఞప్తి చేశారు.

# ప్రీ స్కూల్ పిల్లలకు సెలవు ప్రకటన

## టెక్కలి ప్రాజెక్టు అధికారిని విద్యా శతపతి

**నవతరం టెక్కలి:** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ టెక్కలి పరిధిలోగల టెక్కలి మండలండ నందిగామ మండలం అంగన్వాడీ ప్రీస్కూల్ పిల్లలకు సెలవు ప్రకటించడం జరిగిందిఅని ప్రాజెక్ట్ అధికారిని విద్యాశతపతి తెలిపారు. టేక్ హోమ్ రేషన్ రూపంలో ప్రీస్కూల్ పిల్లలకు ఫుడ్ సరఫరా చేయమని అంగన్వాడి కార్యకర్తలకు సహాయకురాలికి ఆదేశించటం జరిగిందనీ అదేవిధంగా ప్రస్తుత తుఫాన్ అకాల వర్షాభావ ప్రభావం కారణంగా ఎక్కడైనా అంగన్వాడి భవనము ప్రమాదకరమైనచో లబ్ధిదారులు గాని అంగన్వాడీ సిబ్బంది గానీ పిల్లలు గానీ అందులో ఉండరాదని అటువంటివి ఏమైనా ఉంటే స్థానికంగా మహిళా పోలీసు లేదా మీ సెక్టార్ సూపర్వైజర్ కి తెలియపరచి స్టాక్ ను భద్రమైన ప్రదేశంలో ఉంచాలి అని సూచనలును జారీ చేస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



# అధికారులు నిర్లక్ష్యమే దీనికి కారణం. తక్షణ చర్యకు సిపిఎం డిమాండ్

**నవతరం టెక్కలి :** స్థానికటెక్కలి రైల్వే స్టేషన్ దిగువ బాపారెడ్డి కాలనీ జలమయమై జనం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.తక్షణం చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుంది. యిటీవల కాలంలో టెక్కలి తొలుసూరుపల్లి రోడు నిర్మాణ పనులు వలన నీరు బయటకుపోయే పైపును మూసివేశారు. మండల ఇంజనీరింగ్ శాఖ నిర్వహనే ఈ యిబ్బందికి ప్రధాన కారణం, వర్షం పడితే నీరునిల్వ ఉండిపోతుంది. ఇటువంటి యిబ్బందులు వస్తాయని ముందుగానే గ్రామ పంచాయతీ కు స్థానిక కాలనీ నివాసి కోరాడ మోహనరావు ఆద్వర్యంలో ప్రజలు పిర్యాదు చేశారని అన్నారు. టెక్కలి ఆర్ డి ఓ వారికి పిర్యాదు చేసియున్నారు.గాని అధికారులు నుండి ఎటువంటి స్పందన లేకపోవడం వలన నేడు ఈ దుస్థితి కి కారణమై జనం ఆందోళన చెందుతున్నారు. గావున తక్షణం నీటిని బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు,కొల్లి యల్లయ్య,కె.మోహనరావు తదితరులు డిమాండ్ చేశారు. తదుపరి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రావు తో సంప్రదించడం జరిగింది అని తెలియజేయడం కొసమెరుపు.



Printed by **SIRIGIRI VARADARAJU**, and published by SIRIGIRI VARADARAJU, on behelf of **SIRIGIRI VARADARAJU**, and printed at: Kranthi Publications, D.No.2-504/1 Aditya Nagar Colony, Arasavilli, Srikakulam, Srikakulam Dist. ANDHRA PRADESH STATE - 532 401, Published at : Kranthi Publications, D.No.2-504/1. Srikakulam Dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor: **SIRIGIRI VARADARAJU**, Email: navararamraju@gmail.com, Cell: **9959007255, 8340844777**